# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-09-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఎన్డీయే ప్రభుత్వం తొలి వంద రోజుల పాలనలో వికసిత్ భారత్ దిశగా పలు నిర్ణయాలను తీసుకుందని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.**
2. **రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నుంచి స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.**
3. **పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు.**
4. **రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని రాష్ట్ర శాసనసభాపతి సి. హెచ్ అయ్యన్నపాత్రుడు తెలిపారు.**
5. **రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ యాజమాన్య కోటా ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం వెబ్ ఐచ్ఛికాల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం తొలి వంద రోజుల పాలనలో వికసిత్ భారత్ దిశగా పలు నిర్ణయాలను తీసుకుందని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఈ రోజు ఢిల్లీలో మోదీ 3.0 పేరుతో రూపొందించిన సంక్షిప్త సంచికను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తో కలిసి అమిత్ షా విడుదల చేశారు. అనంతరం హెూంమంత్రి మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా పలు నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. డిజిటల్ ఇండియా విధానాలు ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రశంసలు పొందుతున్నాయని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (37 సెకన్లు)

---------------------------

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా పలు స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తిరుపతిలో నిర్వహించిన స్వచ్ఛతా ర్యాలీలో స్థానిక శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ నగరాల్లో దేశంలోనే తిరుపతి మూడో స్థానంలో ఉందని తెలిపారు.

ఈరోజు అనంతపురంలో నిర్వహించిన స్వచ్ఛతా ర్యాలీలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, నగరపాలక సంస్థ మేయర్ వసీం సలీమ్ పాల్గొన్నారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించిన స్వచ్ఛ అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 15 రోజులపాటు స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు.

విజయవాడ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఆనందరావు పాటిల్ పాల్గొని రైల్వే అధికారులు, విద్యార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞను చేయించారు.

మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ప్రతీ ఏడాది అక్టోబర్ 2వ తేదీని స్వచ్ఛ భారత్ దివస్‌గా పాటిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈరోజు పార్వతీపురంలో నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ.. స్వభావ స్వచ్ఛతా, సంస్కార స్వచ్ఛతా ఇతివృత్తంతో ఈ ఏడాది స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

చిత్తూరులో నిర్వహించిన స్వచ్ఛతాహి సేవ ర్యాలీని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.

---------------------------

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర శాసనసభాపతి సి.హెచ్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ రోజు ...విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి ప్రధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

---------------------------

ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా పలువురు ప్రముఖులు సామజిక మాధ్యమాల ద్వారా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, పలువురు కేంద్రమంత్రులు, వివిధ రంగాల ప్రముఖులు ప్రధాన మంత్రికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తోసహా పలువురు ప్రధానికి శుభాకాంక్షలు తెలిపారు. నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం మరింత పురోగమించాలని వారు ఆకాంక్షించారు.

---------------------------

పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి

కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. శ్రీకాకుళంలో ఈ రోజు నిర్వహించిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, దేశాన్ని పరిశుభ్ర భారత్ గా మార్చేందుకు స్వచ్ఛ భారత్ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. దేశమంతా పరిశు భ్రంగా ఉండాలని ఉద్దేశ్యంతో 14 రోజులపాటు స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని కేంద్ర మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (38 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలోని కొత్త వైద్య కళాశాలల్లో , ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ యాజమాన్య కోటా ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం తొలి దశ కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఐచ్ఛికాల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వెబ్ సైట్ drntr.uhsap.in ద్వారా ఐచ్ఛికాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 19వ తేదీ రాత్రి తొమ్మిది గంటల వరకు ఐచ్ఛికాల నమోదుకు చివరి గడువుగా నిర్ణయించినట్లు తెలిపారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చిత్తూరుజిల్లా అటవీశాఖాధికారి చైతన్యకుమార్ రెడ్డి కోరారు. చిత్తూరు జిల్లా యాదమరి మండలంలోని మహాసముద్రం గ్రామంలో ఈ రోజు ఏక్ పేడ్ మా కే నామ్- అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైతన్యకుమార్ రెడ్డి మాట్లాడుతూ, మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. చెట్లను నాటడం ద్వారా భూతాపాన్ని తగ్గించవచ్చని తెలిపారు.

---------------------------

విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి 12 వరకు నిర్వహించే దసరా ఉత్సవాలకు భద్రత ఏర్పాట్లను చేస్తున్నామని విజయవాడ నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. విజయవాడ కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి వద్ద ప్రారంభమయ్యే క్యూలైన్ పనులను ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా దేవస్థాన ఇంజినీరంగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. భక్తులకు దేవాలయానికి సంబంధించిన వివరాలను తెలిపేలా సూచికలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

---------------------------

దేశ వ్యాప్తంగా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా సెప్టెంబర్ నెలను పోషకాహార మాసంగా నిర్వహిస్తోంది. “జాతీయ పోషకాహార మిషన్” అని కూడా పిలిచే ఈ కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2018 మార్చి 18వ తేదీన ప్రారంభించారు. పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించి వారిని ఆరోగ్య వంతులుగా తీర్చి దిద్దడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. బాల బాలికల ఆరోగ్య పరిరక్షణకు ఈనెల 30వ తేదీ వరకు పలు కార్యక్రమాలు కొనసాగుతాయి. రక్తహీనత పెరుగుదల, పర్యవేక్షణ, పోషకాహారం వంటి అంశాలతో పోషన్ భీ -పడాయి భీ అనే నినాదంతో ఈ సంవత్సరం కార్యక్రమాలను అమలు చేస్తున్నారు.

---------------------------

ప్రముఖ హరికథా విద్వాంసులు కోటా సచ్చిదానంద శాస్త్రి నిన్న రాత్రి గుంటూరులో కన్నుమూశారు. బాపట్ల జిల్లా అద్దంకిలో 1934, ఆగష్టు 12వ తేదీన సచ్చిదానంద శాస్త్రి జన్మించారు. 70 ఏళ్ళపాటు టాప్ గ్రేడ్ కళాకారులుగా విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో హరికథా గానం చేశారు. ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం నుంచి 2023లో పద్మశ్రీ పురస్కారాన్ని, 2018లో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డును, 2014లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి హంస పురస్కారాన్ని పొందారు. ఆయన మృతి పట్ల ఆకాశవాణి విజయవాడ కేంద్రం అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

=======================